# సంగారెడ్డి మెదక్

శనివారం 10 అక్టోబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:10






## వట్‌పల్లి మండలంలో విద్యుత్ కోతలపై రైతులకు మద్ధతుగా ధర్నా

**వట్టిపల్లి అక్టోబర్ 9 ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పాల్వట్ల గ్రామంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులకు మద్దతుగా అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ గారు రోడ్డుపై నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు.

వివరాలు 2లో

# మల్కాపూర్ గ్రామ 96,100,103 సర్వే నెంబర్లలో అక్రమ వెంచర్లు..



- లేఅవుట్ పనులు పూర్తికాకముందే క్రయవిక్రయాలు..
- పంచాయతీ అధికారుల పర్యవేక్షణ ఏది?
- మల్కాపూర్ శివారులో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ల నిర్మాణాలు.
- ఫిర్యాదులు చేసినా క్షేత్రస్థాయి తనిఖీలు లేవంటున్న స్థానికులు..
- కొనుగోలుదారుల ప్రయోజనాలు గాలికి!

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొండాపూర్ మండలం మల్కాపూర్ రెవెన్యూ శివారులో ప్రాథమిక అనుమతులతోనే ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేఅవుట్‌లలో అవసరమైన మౌలిక వసతుల పనులు పూర్తికాకముందే ప్లాట్లకు హద్దులు ఏర్పాటు చేసి క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల అమలును పర్యవేక్షించాల్సిన పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు ఇచ్చిన తర్వాత వాటి అమలును పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? ఫిర్యాదులు అందుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మల్కాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి మల్లేపల్లి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నంబర్లు 96పీ, 100పీ, 103పీ లలో సుమారు 22,280.63 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఒక ప్రైవేట్ ఓపెన్ లేఅవుట్, సర్వే నంబర్ 94లో సుమారు 40,830.9 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మరో వెంచర్ పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ రెండు వెంచర్లకు ప్రాథమిక అనుమతులు ఉన్నప్పటికీ, తుది అనుమతుల పరిస్థితి, నిబంధనల మేరకు పనులు పూర్తయ్యాయా లేదా అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

మిగతా 2 లో



# మల్కాపూర్ గ్రామ 96,100,103 సర్వే నెంబర్లలో అక్రమ వెంచర్లు

మొదటిపేజీ తరువాయి

**గజం రూ.27 వేల నుంచి రూ.35 వేల వరకు విక్రయాలు**

ప్రాథమిక దశలోనే గజం రూ.27 వేల నుంచి రూ.35 వేల వరకు ధరలకు ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసే సామాన్య ప్రజలకు పూర్తి స్థాయి అనుమతులు, మౌలిక వసతుల వివరాలు తెలియజేయాల్సిన బాధ్యత వెంచర్ నిర్వాహకులపై లేదా? కొనుగోలుదారులు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటే బాధ్యత ఎవరిది? లేఅవుట్ పనులు పూర్తికాకముందే విక్రయాలు సాగుతున్నాయనే ఆరోపణలపై అధికారులు తక్షణమే విచారణ జరపాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.నిబంధనల ప్రకారం సంబంధిత అనుమతుల్లో పేర్కొన్న రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, పార్కు స్థలాలు, గ్రీనరీ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు వర్తించే అనుమతి ప్రక్రియను పూర్తి చేయాలి. అయితే, ఆయా వెంచర్లలో పనుల పురోగతి ఏమిటి? అనుమతుల్లో విధించిన షరతులు అమలవుతున్నాయా? తుది లేఅవుట్ అనుమతి పొందారా? అనే వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**రెండు నెలలుగా ప్రహరీ గోడ నిర్మాణం.. అధికారుల అండదండలతోనే ఈ నిర్మాణాలా?**

సర్వే నంబర్ 94లోని వెంచర్ చుట్టూ సుమారు రెండు నెలలుగా ప్రహరీ గోడ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? వర్తించే నిబంధనలకు అనుగుణంగానే పనులు చేపడుతున్నారా? అనే అంశాలపై స్పష్టత లేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో తగిన పరిశీలన జరగలేదని వారు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులపై స్పందించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**రోడ్లు లేవు.. మౌలిక వసతులు పూర్తికాలేదు.. అయినా అమ్మకాలు!**

వెంచర్లలో రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పనులు పూర్తికాకముందే ప్లాట్లకు హద్దులు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్లాట్లన్నీ విక్రయించిన తర్వాత నిర్వాహకులు అందుబాటులో లేకపోతే మిగిలిన పనులు ఎవరు పూర్తి చేస్తారు? పార్కులు, గ్రీనరీ, రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు లేక కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటే ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**అనుమతులకు మించి నిర్మాణాలు**

మల్కాపూర్ శివారులో వెంచర్లతో పాటు కొన్ని భవన నిర్మాణాల్లోనూ అనుమతులకు మించి పనులు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోనైనా, హెచ్ఎండీఏ పరిధిలోనైనా వర్తించే నిబంధనలు, ఆమోదించిన ప్లాన్ల మేరకు నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా అన్నది పరిశీలించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. అనుమతుల్లో పేర్కొన్న పరిమితులను ఉల్లంఘించినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణమా? వెంచర్లలో నిబంధనల ఉడ**

# వట్‌పల్లి మండలంలో విద్యుత్ కోతలపై రైతులకు మద్దతుగా ధర్నా



మొదటిపేజీ తరువాయి

రైతులకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా నిరసన చేపట్టారు. ఏ ఈ వినతి పత్రం ఇవ్వడం జరిగింది .ఈ కార్యక్రమంలో రైతులతో పాటు మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి సొసైటీ చైర్మన్ వినోద్ గౌడ్ బసవరాజు మధు అశోక్, సదానందం ప్రభాకర్ సుభాష్ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# దుర్గాభవాని అమ్మవారికి ఘన స్వాగతం..!

## - దసరా నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు
## - డప్పు చప్పుళ్ల మధ్య స్వాగతం పలికిన గ్రామస్తులు, మహిళలు

**జహీరాబాద్, అక్టోబర్ 09( ప్రజా జ్యోతి న్యూస్)**



దసరా నవరాత్రి ఉత్సవాలు అక్టోబర్ 11నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దీపూర్‌లోని భవాని దేవస్థానం వద్ద భవాని సేన ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు ప్రతిష్ఠించ నున్న దుర్గాభవాని అమ్మవారి విగ్రహానికి గ్రామస్తులు, మహిళలు భక్తిశ్రద్ధలతో ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళు ్ల, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసు కొచ్చారు. మహిళలు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి అమ్మవారికి నీరాజ నాలు సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రతిష్ఠిం చేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజులపాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కోలాటం, భజన, సంకీర్తన కార్యక్రమాలతో ఉత్సవా లను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం విజయదశమి రోజున రావణాసుర దహనం, జమ్మి పూజ తదితర కార్యక్రమా లను ఘనంగా నిర్వహించ నున్నారు.

# పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**హత్నూర 9 అక్టోబర్ (ప్రజాజ్యోతి)**

మండల పరిధిలో ని గోవిందరాజ్ పల్లి, నస్తిపూర్ స్థానిక పాఠశాలల్లో శుక్రవారం నాడు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం నుంచి దసరా సెలవులు ప్రారంభం కానుండటంతో విద్యార్థులు ముందస్తుగా వేడుకలను నిర్వహించారు.గోవిందరాజ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలతో సందడి చేశారు. మన సంస్కృతీసంప్రదాయాల పట్ల అవగాహన పెంచేందుకే ఈ వేడుకలు ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం యశోద, ఉపాధ్యాయురాలు సవిత తెలిపారు. అటు నస్తీపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ ప్రమీల సాయిలు మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచే ఆచారవ్యవహారాలు నేర్పించాలన్నారు. పూలతో చేసే బతుకమ్మ నిమజ్జనం వల్ల నీరు శుభ్రపడుతుందని హెచ్ఎం లోకనాథం పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ మహేందర్, ఉపాధ్యాయుడు నరేష్, వాలంటీర్ ప్రవళిక, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# వరిగుంతం గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి బూతు పురాణం...

## - నన్ను అడగడానికి నీవు ఎవడివి.....

## - ప్రశ్నించిన దండు ప్రశాంత్ తేజ పై బూతులతో దూషణ....

**కొల్చారం,అక్టోబర్ 09(ప్రజా జ్యోతి)**

కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామంలో గ్రామసభలో పంచాయతీ నిధుల దుర్వినియోగం అవినీతి అక్రమాలపై ప్రశ్నించిన దండు ప్రశాంత్ తేజ యువకుడి పై పంచాయతీ కార్యదర్శి బూతులు తిడుతూ.. ఎదురుదాడికి దిగిన సంఘటన శుక్రవారం వరిగుంతం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో జరిగింది. శుక్రవారం సర్పంచ్ మోహన్ అధ్యక్షతన వరిగుంతం గ్రామపంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి నూతన పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నుండి ఇప్పటివరకు గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రక్షిత మంచినీటి మీ సరఫరా చేసే మూడు మోటార్ల స్టార్టర్ల మరమ్మతులకురూ.36 వేల రూపాయలు ఖర్చు చేయడం, పైప్లైన్ లీకేజీలకు రూ.40,000 ఖర్చు చేయడం పది ట్రిప్పుల మట్టి రోడ్డుపై రెండు స్థలాలను వేసి రూ.1,33,000 రూపాయలు ఎంబి రికార్డు చేయడం ద్వారా డ్రా చేయడం పై గ్రామానికి చెందిన యువకులు పంచాయతీ కార్యదర్శి సర్పంచులను నిలదీశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రూ. రెండు లక్షల ఇరవై వేలు తాను ఖర్చు చేసినట్లు ఎంబిలో రికార్డు చేయగా రూ.మూడు లక్షల అరవై వేల రూపాయలు తన తల్లి సరస్వతి అకౌంట్లోకి ఎలా మళ్ళించారని యువకులు పంచాయతీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తన అవినీతి అక్రమాల ప్రశ్నించినదండు ప్రశాంత్ తేజ యువకుడిని బూతులు తిడుతూ నీవు ఎవ్వడిని నన్ను అడగడానికి అంటూ ఎదురు దాడికి దిగారు.దీంతో గ్రామసభ రచ్చ రచ్చగా మారింది. పంచాయతీ పాలకవర్గం 9 నెలల కాలం లో సుమారు రూ.13 లక్షల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయంటూ గ్రామస్తులు ప్రశ్నించడంతో సర్పంచ్ మోహన్, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవితో వాగ్వాదం జరిగింది.గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన బిల్లులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రామస్తులు నిలదీయడం చర్చనీయాంశంగా మారింది.

**- విచారణతోనే నిజా నిజాలు వెలుగులోకి....**

గ్రామపంచాయతీ నిధుల ఖర్చులపై వస్తున్న ఆరోపణలు స్థానికంగా చర్చకు దారితీశాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. ఆరోపణల్లో



వాస్తవమెంత, నిధుల వినియోగంలో నిబంధనలు పాటించారా లేదా అన్నది సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటంతో పాటు, ప్రతి రూపాయికి లెక్క చెప్పేలా సంబంధిత యంత్రాంగం చర్యలు చేపట్టాలని వరిగుంతం గ్రామస్తులు కోరుతున్నారు.

---

# గ్రామసభలో సర్పంచ్ మౌనం.. పెత్తనం చలాయిస్తున్నది ఆ నాయకుడేనా?

## సర్పంచ్ కేవలం బొమ్మేనా?గ్రామసభలో

## మరో నాయకుడి జోక్యంపై గ్రామస్తుల ఆగ్రహం



**కొల్చారం, అక్టోబర్ 09(ప్రజా జ్యోతి):-**

మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామసభలో సర్పంచ్ పుట్లగళ్ల మోహన్ వ్యవహారశైలిపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సమస్యలపై సర్పంచ్ స్పందించాల్సిన సమయంలో మరో నాయకుడు జోక్యం చేసుకుంటూ మాట్లాడటంపై పలువురు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో సర్పంచ్ ఉన్నప్పటికీ, ఆయన వెనుక ఉండి మరో నాయకుడు పెత్తనం చలాయిస్తున్నారనే ఆరోపణలు గ్రామసభలో చర్చనీయాంశంగా మారాయి.గ్రామంలో ఏ పని చేయాలన్నా సదరు నాయకుడి సలహాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతున్న సమయంలో సదరు నాయకుడు జోక్యం చేసుకుంటూ మాట్లాడటం, ఇతరులు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

**సర్పంచ్ ఉండగా.. మరో నాయకుడి పెత్తనం ఎందుకు?**

గ్రామానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి పనులపై నిర్ణయాలు తీసుకోవాల్సిన గ్రామసభలో ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే, సర్పంచ్ మాట్లాడుతున్న సమయంలో సదరు నాయకుడు జోక్యం చేసుకుంటూ మాట్లాడటం, గ్రామసభలో తానే చెప్పిందే వినాలన్నట్లుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే స్వేచ్ఛ ఉండాలని, మధ్యలో అడ్డుకోవడం తగదని అన్నారు. సర్పంచ్ స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారా? లేక మరో నాయకుడి సూచనల మేరకు పనిచేస్తున్నారా? అన్న అనుమానాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

**ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది?**

గ్రామంలో ప్రజలకు సంబంధించిన పనులు, సమస్యల పరిష్కారంలో సర్పంచ్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామసభ అనేది ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి, సమస్యలపై చర్చించడానికి ఏర్పాటు చేసిన వేదిక అని, అక్కడ ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నం చేయకూడదని పేర్కొన్నారు.

ఈ వ్యవహారంపై దండు ప్రశాంత్ తేజ, ఆకుల రాజు, మాజీ ఎంపీటీసీ తుడుము రామకృష్ణ, దండు రాజు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామసభలో ప్రజలకు మాట్లాడే అవకాశం కల్పించాలని, ప్రజా సమస్యలపై సర్పంచ్ స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని వారు కోరారు

# నేటి నుంచి శ్రీ బగలాముఖి శరన్నవరాత్రి మహోత్సవాలు

## మహాలయ అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు..





**శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 09:**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని శ్రీ బగలాముఖి శక్తిపీఠంలో శ్రీ బగలాముఖి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు నేటి నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మహాలయ అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు,అర్చనలు నిర్వహించడంతోపాటు ఆలయానికి వచ్చే భక్తులకు వితరణ చేయనున్నారు.

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

దశమహావిద్యలలో విశిష్ట స్థానం కలిగిన శ్రీ బగలాముఖి అమ్మవారిని శరన్నవరాత్రుల సమయంలో ఆరాధించడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు శివంపేటతోపాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

### పబ్బా రమేష్ గుప్త కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం

మహాలయ అమావాస్య సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు స్థలదాత పబ్బా స్వరూపారాణి, పబ్బా రమేష్ గుప్త కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. పబ్బా రమేష్ గుప్త, పబ్బా స్వరూపారాణి, పబ్బా స్వాతి, మహేష్ గుప్త కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. పండుగ పర్వదినాన అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు భోజన సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సేవా కార్యక్రమంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 18న మహాశోభాయాత్ర..19న కుంకుమార్చన

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల నుంచి శివంపేట గ్రామంలో మహాశోభాయాత్ర నిర్వహించనున్నారు. 19వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి 108 మంది సుమంగళులతో ప్రత్యేక కుంకుమార్చన, మహామంగళహారతి కార్యక్రమాలు చేపట్టనున్నారు. 20వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పర్యవేక్షిస్తున్నారు.

### ఉత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహకుల విజ్ఞప్తి

బతుకమ్మ,దసరా పండుగల వేళ శ్రీ బగలాముఖి శక్తిపీఠంలో నిర్వహించే శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించనున్నాయి. పూజలు, శోభాయాత్ర, కుంకుమార్చన, అన్నదానం వంటి కార్యక్రమాల్లో శివంపేట మండల ప్రజలతోపాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

# గొల్లపల్లి పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ..

- విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేసిన సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి..




**కొండాపూర్ ప్రజా జ్యోతి**

కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యున్నతికి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజలింగం, ఉపసర్పంచ్ ప్రియాంక నర్సింలు, వార్డు సభ్యులు నవనీత, వీరారెడ్డి, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ వెంకటమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో నూతన జి వి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు

**జహీరాబాద్, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి న్యూస్)**

నియోజకవర్గ జహీరాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జి వి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ.. వ్యాపార రంగంలో నూతనంగా అడుగు పెడుతున్న వ్యాపారవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపార సంస్థల అభివృద్ధితో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ ఆర్థికాభివృద్ధికి దోహదపడు తుందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులను అందిస్తూ, వినియోగదారుల నమ్మకాన్ని పొందుతూ జి వి షాపింగ్ మాల్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, మొగుడం పల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, కౌన్సిలర్ లు యాకూబ్, అబ్దుల్లా, జాకీర్, గౌస్ గోరి, మహిపాల్ యాదవ్, విశ్వేశ్వర్, ప్రవీణ్, శంకర్ రెడ్డి, పాండు, జాహెద్, రాజు, గ్రామాల సర్పంచ్ లు ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# శ్రీ లలితమ్మ సన్నిధిలో శరన్నవరాత్రి మహోత్సవాలు

- భక్తులకు కనువిందు చేయనున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- అక్టోబర్ 11 నుంచి 21 వరకు అమ్మవారి సేవలో ఆధ్యాత్మిక పూజలు
- చండీయాగాలు, మహా పూజలు, అన్నదానం
- శృంగేరీ శారదా పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి , జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి ఆశీస్సులతో..
- దేవీ ఉపాసనలో విశేష అనుభవం కలిగిన బ్రహ్మశ్రీ సోమయాజుల రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో వేడుకలు..





**తూప్రాన్ (ప్రజాజ్యోతి) అక్టోబర్ 09:**

వేదమంత్రాల నడుమ, భక్తి పారవశ్యంతో, అమ్మవారి నామస్మరణతో తూప్రాన్ పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుంది. శృంగేరీ శారదా పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు, జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారి ఆశీస్సులతో, శ్రీ లలితా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మించి నిర్వహిస్తున్న శ్రీ లలితా పరమేశ్వరీ దేవీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. తూప్రాన్‌లోని వెంకటాపురంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ సరస్వతీ సమేత శ్రీ లలితా పరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో పదకొండు రోజులపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చండీయాగాలు, మహా పూజలు, అన్నదాన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది.

## ప్రతిరోజూ విశేష పూజలు.. అమ్మవారికి ప్రత్యేక అర్చనలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభవ ువుతాయి. అనంతరం సోమనాథేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అమ్మవారికి విశేష అభిషేకాలు, చతుష్షష్ట్యుపచార పూజలు భక్తిప్రపత్తులతో జరగనున్నాయి. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు అమ్మవారికి మహాపూజ నిర్వహిస్తారు.ప్రతిరోజూ సువాసినులచే కుంకుమార్చనలు, పుష్పార్చనలు, ఒడిబియ్యం సమర్పణ తదితర సంప్రదాయబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని తమ భక్తిని చాటుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



## నిత్యం చండీయాగం.. భక్తులకు అన్నప్రసాద వితరణ

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ మధ్యాహ్నం చండీయాగం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. వేదమంత్రోచ్ఛారణలు, యాగ క్రతువులు, దేవీ ఆరాధనతో ఆలయ ప్రాంగణం భక్తి భావనతో మార్మోగనుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితోపాటు అన్నప్రసాదం స్వీకరించే అవకాశం కల్పించనున్నారు.దేవీ ఉపాసనలో విశేష అనుభవం కలిగిన బ్రహ్మశ్రీ సోమయాజుల రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలు నిర్వహించనున్నారు. తొమ్మిది తరాలుగా దేవీ ఉపాసన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న సోమయాజుల వంశానికి చెందిన రవీంద్ర శర్మ, ఇప్పటివరకు 1,470 చండీయాగాలు నిర్వహించిన శాక్తేయులుగా గుర్తింపు పొందారు. అష్టోత్తర శత, సహస్ర, అయుత చండీయాగాల నిర్వహణతోపాటు అనేక ఆధ్యాత్మిక సేవల్లో ఆయన పాలుపంచుకున్నారు.ఆర్షధర్మ ప్రచారకులు, సహస్ర యజ్ఞ స్వరాట్, సహస్ర యాగ భూషణ, శ్రీ విద్యా శిరోమణి, అయుత చండీ ఉపాసక రత్న తదితర బిరుదులతో గౌరవించబడిన ఆయన, శ్రీశైలంలోని కదలీవనంలో శ్రీ నృసింహ సరస్వతీ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనలోనూ, తూప్రాన్ పట్టణంలోని శ్రీ బాలాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణ నిర్వహణలోనూ కీలక పాత్ర పోషించారు. శ్రీ లలితా సేవా సమితి వ్యవస్థాపకులుగా ఆలయ ఆధ్యాత్మిక కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తున్నారు.

## అమ్మవారి సన్నిధికి తరలిరండి.. ఆశీస్సులు పొందండి

భక్తుల కొంగుబంగారంగా, కొలిచిన వారికి కొంగుబంగారమై, భక్తితో పిలిచిన వారికి పలికే దైవంగా శ్రీ లక్ష్మీ సరస్వతీ సమేత శ్రీ లలితా పరమేశ్వరీ దేవి భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్నారని బ్రహ్మశ్రీ సోమయాజుల రవీంద్ర శర్మ పేర్కొన్నారు.దేవీ శరన్నవరాత్రులు కేవలం పూజా కార్యక్రమాలే కాకుండా, శక్తి ఆరాధనకు, ధర్మ పరిరక్షణకు, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీకలని తెలిపారు. ఈ పవిత్ర ఉత్సవాల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని, ప్రత్యేక పూజల్లో భాగస్వాములై జగన్మాత కరుణాకటాక్షాలను పొందాలని ఆయన పిలుపునిచ్చారు.







# భీమ్! జై తెలంగాణ! జై బహుజన !జై భారత రాజ్యాంగం జై భీమ్ ఆర్మీ!!

**జహీరాబాద్, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి న్యూస్)**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో మహా నీయులు మాన్యవర్ కాన్షీరామ్ గారి 20వ వర్ధంతి సందర్భంగా భీమ్ ఆర్మీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ అలీమ్ ఆధ్వర్యంలో కాన్షీరామ్ గారికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) అధ్యక్షులు సిద్దు రావణ్ మాట్లాడుతూ... బహుజనుల చైతన్యానికి బాటలు వేసిన మహనీయు డని, సామాజిక మార్పుకు స్ఫూర్తి ప్రదాత అని అధికారం లేని సమాజానికి ఆత్మగౌరవం, సమానత్వం సాధించడం కష్టసాధ్యమని రాజకీయ చైతన్య సందేశాన్ని బహుజనులలో విస్తరించిన దర్శనీకుడు. అంబేద్కర్ గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బహుజన సమాజంలో హక్కుల పట్ల అవగాహన పెంపొందించి కుల వివక్షతకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల హక్కుల కోసం సమాన అవకాశాల సాధన కోసం నిరంతరం కృషి చేసిన పోరాట యోధుడని తెలియజేశారు. కాన్షి రామ్ గారు మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన నాటిన బహుజన చైతన్య బీజాలు తరతరా లకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయన్నారు. కాన్షీరామ్ గారి ఆశయాల సాధనే మన నిజమైన నివాళి .బహుజన ఐక్యత, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణే భీమ్ ఆర్మీ ముందున్న కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ధనరాజ్ బాల్రాజ్ విజయ్ కుమార్, అనంతరం ,రాకేష్ మామయ్య, నరసింహులు ముదిరాజ్ ,ప్రేమ్ కుమార్, పండరి, రాచన్న చంద్రయ్య, బలరాం, గోపాల్, గౌతమ్ కృష్ణ, జైపాల్, రామ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి ఫిర్యాదులపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?

## - బెల్టు షాపులపై ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..

## ఉదయమే గ్రామాలకు మద్యం సరఫరా

## - ప్రజల సమస్యలను పట్టించుకోరా? బీఎస్పీ నేత పీపాడ్‌పల్లి మోహన్ ఆగ్రహం

**రాయికోడ్ అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని బీఎస్పీ నేత పీపాడ్‌పల్లి మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయికోడ్ మండల పరిధిలో బెల్టు షాపుల ద్వారా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటూ ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజావాణిలో మండల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళు_న్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.

### ఫిర్యాదు ఎక్సైజ్ శాఖకు పంపినా స్పందనేదీ?

రాయికోడ్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఫిర్యాదుదారుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు గ్రీవెన్స్ ఐడీ కేటాయించడంతోపాటు, విచారణ, పరిష్కారం కోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి పంపినట్లు ప్రజావాణి రశీదులో పేర్కొన్నారు. అయితే ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై స్పష్టత లేదని ఫిర్యాదుదారుడు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై స్పందించిన బీఎస్పీ నేత పీపాడ్‌పల్లి మోహన్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో ప్రజావాణిని ఆశ్రయిస్తారని,అలాంటి ఫిర్యాదులనే అధికారులు పట్టించుకోకపోతే ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ఫిర్యాదులను సంబంధిత శాఖలకు బదిలీ చేయడంతోనే బాధ్యత పూర్తయినట్లు భావించకూడదని,వాటిపై విచారణ జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఉదయమే గ్రామాలకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు

రాయికోడ్ మండల పరిధిలోని కొన్ని వైన్స్ షాపుల నుంచి ఉదయమే మద్యం సీసాలను వాహనాల్లో వివిధ గ్రామాలకు తరలించి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని మోహన్ తెలిపారు. వైన్స్ షాపుల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్నారో లేదో ఎక్సైజ్ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వైన్స్ నిర్వాహకులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మండల ప్రజల సమస్యలపై నిర్లక్ష్యమెందుకు?

ప్రజావాణిలో మండల ప్రజలు సమర్పిస్తున్న ఫిర్యాదులను అధికారులు



సీరియస్‌గా తీసుకోవడం లేదని మోహన్ విమర్శించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగి తమ సమస్యలను విన్నవించినప్పటికీ పరిష్కారం లభించకపోతే ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం ఎలా ఏర్పడుతుందని ప్రశ్నించారు. ప్రజావాణి కార్యక్రమం కేవలం ఫిర్యాదులు స్వీకరించడానికి, వాటిని ఇతర శాఖలకు పంపడానికి మాత్రమే పరిమితం కాకూడదని, ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

### బెల్టు షాపులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి

రాయికోడ్ మండల పరిధిలో బెల్టు షాపులు ఉన్నాయనే ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మోహన్ కోరారు. అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు విచారణలో తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయమే వైన్స్ షాపుల నుంచి గ్రామాలకు మద్యం సీసాలను వాహనాల్లో తరలిస్తున్నారనే ఆరోపణలపైనా ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలని కోరారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మోహన్ విజ్ఞప్తి చేశారు.రాయికోడ్ మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలని అన్నారు.ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో విచారణ జరిపి,తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# బ్రహ్మణపల్లి జిల్లాపరిషత్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**లినర్సాపూర్ 9 అక్టోబర్ (ప్రజాజ్యోతి)**

మండలంలోని శుక్రవారం నాడు జెడ్పీహెచ్ఎస్ బ్రహ్మణపల్లి పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు,విద్యార్థులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి,బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ ఆడుతూ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. పాఠశాల ఆవరణ బతుకమ్మ పాటలతో విద్యార్థుల సందడితో కళకళలాడింది. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ప్రకృతి ప్రేమకు, పూల వైభవానికి ప్రతీక అని ఉపాధ్యాయులు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు విద్యార్థుల్లో ఐక్యత,సాంస్కృతిక విలువలు,ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవాని,మంజుల,అఫ్రిన్ ఫాతిమా, మల్లయ్య సర్, శ్రీనివాస్ సర్, శేఖర్, శ్రీనివాస్,శివ శంకర్,హైదర్ సర్,షరీఫ్ సర్, ఉపేందర్ సర్ పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు మన పండుగల విశిష్టతను తెలియజేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



# దసరా వేళ మనూర్‌లో విషాదం..

## - కాలుజారి సంగమేశ్వరకుంటలో పడి ముగ్గురు మృతి
## - మృత్యుంజయుడిగా బయటపడిన హర్షవర్ధన్ రెడ్డి






**నారాయణఖేడ్, అక్టోబర్ 9, ప్రజాజ్యోతి:**
దసరా పండుగ నేపథ్యంలో ఇంట్లోని బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు నీటిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన మనూర్ గ్రామ శివారులోని సంగమేశ్వరకుంట వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మరో యువకుడు ప్రాణాలతో బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది.మనూర్ ఎస్సై ఏ. కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మనూర్ గ్రామానికి చెందిన మాటూరి నరసింహారెడ్డి, ఆయన భార్య కృష్ణవేణి, తమ్ముడు సంగారెడ్డి, చిన్న కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం ఉదయం దసరా పండుగ కోసం ఇంట్లోని బట్టలు ఉతికేందుకు గ్రామ శివారులోని సంగమేశ్వరకుంట వద్దకు వెళ్లారు.వారు బట్టలు ఉతుకుతుండగా సంగారెడ్డి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన హర్షవర్ధన్ రెడ్డి కూడా నీటిలో పడిపోయాడు. దీంతో వారిని రక్షించేందుకు నీటిలోకి దిగిన నరసింహారెడ్డి, ఆయన భార్య కృష్ణవేణి సైతం నీటిలో మునిగిపోయారు.ఈ క్రమంలో నీటి అంచున ఉన్న చెట్టు కొమ్మలను పట్టుకున్న హర్షవర్ధన్ రెడ్డి ఎలాగోలా ఒడ్డుకు చేరుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. అనంతరం గ్రామానికి వెళ్లి జరిగిన ఘటనను గ్రామస్తులకు తెలియజేశాడు. దీంతో గ్రామస్తులు, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నీటిలో గాలింపు చేపట్టారు. ఈ గాలింపులో నీటిలో మునిగిపోయిన నరసింహారెడ్డి, కృష్ణవేణి, సంగారెడ్డిల మృతదేహాలు లభ్యమయ్యాయి.మృతుల కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ ఘటనపై నరసింహారెడ్డి పెద్ద కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దసరా పండుగ వేళ ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో మనూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

---

## బతుకమ్మ సంబరాలకు వేదిక..సీసీ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి శ్రీకారం

# కాలనీ మహిళల విజ్ఞప్తికి
# మున్సిపల్ చైర్మన్ స్పందన



**అందోల్, అక్టోబర్ 09, (ప్రజా జ్యోతి):**
అందోల్‌జోగిపేట మున్సిపాలిటీలోని బృందావన్ కాలనీ మహిళలకు బతుకమ్మ వేడుకల నిర్వహణకు సౌకర్యం కల్పించే దిశగా సీసీ ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలోని 3వ వార్డు పరిధిలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకుని కాలనీ మహిళలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్మాణం చేపడుతున్నట్లు చైర్మన్ తెలిపారు. పండుగల సమయంలో మహిళలు బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో వేడుకలు నిర్వహించుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బృందావన్ కాలనీ అధ్యక్షుడు అల్లే శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బస్వ సత్యప్రకాష్, 3వ వార్డు కౌన్సిలర్ మర్రి అరుణకుమారి, 19వ వార్డు కౌన్సిలర్ అల్లే మంజుల, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల ప్రవీణ్, కోరబోయిన నాగరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.




# వర్షాభావం... తీవ్రమైన ఎండ...

# విద్యుత్ కోతలతో రైతుల అవస్థలు

## ఎండుతున్న పంటలు.. కరెంటు కష్టాలు!
## వరి, కూరగాయల పంటలకు నీరందక ఇబ్బందులు..
## ఆందోళనలో అన్నదాతలు

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది. ఒకవైపు వర్షాలు సకాలంలో కురవక పంటలకు తగినంత నీరు అందకపోవడం, మరోవైపు తీవ్రమైన ఎండలు, విద్యుత్ కోతలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా వరి, కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పంటలకు కీలకమైన సమయంలో నీరు అందకపోవడంతో దిగుబడులపై ప్రభావం పడుతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

### వర్షాభావంతో పంటలకు నీటి తిప్పలు

వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయ భూముల్లో తేమ తగ్గుతోంది. వరి, కూరగాయల పంటలకు క్రమం తప్పకుండా నీరు అందించాల్సిన పరిస్థితి ఉండగా, వర్షాలు లేకపోవడం రైతులకు ప్రధాన సమస్యగా మారింది. భూగర్భ జలాలపై ఆధారపడి బోర్లు, మోటార్ల ద్వారా పంటలకు నీరందిస్తున్న రైతులకు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం మరింత ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలను కాపాడుకోవడానికి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఓవైపు ఎండ.. మరోవైపు విద్యుత్ కోతలు

ప్రస్తుతం నెలకొన్న ఎండల తీవ్రతతో భూముల్లో తేమ వేగంగా తగ్గిపోతోంది. ఇలాంటి సమయంలో వ్యవసాయ మోటార్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవసరమని రైతులు చెబుతున్నారు. అయితే విద్యుత్ కోతల కారణంగా మోటార్లను సకాలంలో నడపలేక పంటలకు నీరు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితులు ఉంటే వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం కష్టమవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### పంటలు చేతికొచ్చే సమయంలో నష్టం వాటిల్లుతుందేమోనని ఆందోళన

వరి, కూరగాయల సాగుకు ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల కోసం రైతులు పెట్టుబడులు పెట్టారు. పంటలు ఏపుగా పెరిగి దిగుబడి వచ్చే సమయంలో నీటి కొరత ఏర్పడితే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కూరగాయల సాగులో నీటి అవసరం ఎక్కువగా ఉండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రైతులకు సమస్యగా మారుతున్నాయి. పంటలు ఎండిపోకుండా ఉండేందుకు అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకుంటూ రైతులు నానా తంటాలు పడుతున్నారు.

### అధికారులు స్పందించాలి.. విద్యుత్ సరఫరా మెరుగుపరచాలి.

కొండాపూర్ మండలంలోని వ్యవసాయ రంగ సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా షెడ్యూల్‌ను సక్రమంగా అమలు చేయడంతో పాటు, అనవసర అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంటలకు నీరందించే కీలక సమయంలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కార్మికుల సేవలకు గౌరవం.. లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వస్త్రాల పంపిణీ

## పారిశుద్ధ్య కార్మికులు మన కొరకు ఎండ వాన చలి లెక్క చేయకుండా అందిస్తున్న సేవలు అమోఘం. పి. మహేష్. ఉపసర్పంచ్.



**కల్హేర్, అక్టోబర్ 9, ప్రజా జ్యోతి:**

కల్హేర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ పెరుమాళ్ల మహేష్ చేతుల మీదుగా కార్మికులకు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మహేష్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పరిసరాల్లోని చెత్తాచెదారం, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య కార్మికులు అహర్నిశలు సేవలందిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్మికుల కష్టసుఖాల్లో అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవల వల్లే గ్రామంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం నిరంతరం కొనసాగుతున్నాయని మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు విట్టల్, మల్లేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గైని దేవదాస్, మాజీ మైనార్టీ ఆప్షన్ సభ్యుడు సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు విద్యతోనే భవిష్యత్తుకు బాట డాక్టర్ జెబా కమ్యూనిటీ హెల్త్ సెంటర్

**కల్హేర్ , అక్టోబర్ 9, ప్రజాజ్యోతి:**

ఆడపిల్లల రక్షణ, విద్యతో పాటు మహిళా సాధికారతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ జెబా అన్నారు. బాచుపల్లి గ్రామంలో ఉన్నత పాఠశాల లో మాట్లాడుతూ బచావోబేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు మహిళా సాధికారత, బాలికల రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జెబా మాట్లాడుతూ ఆడపిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి




భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు మంచి విద్యతో పాటు ఆరోగ్యం, భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు గుడ్ టచ్‌బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, ఆరోగ్య పరిరక్షణ, మహిళల పట్ల గౌరవం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం కఠినమైన చట్టాలను అమలు చేస్తోందని, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఆడపిల్లలను రక్షించడం, వారికి విద్య అందించడం ద్వారా మహిళా సాధికారతకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# సమతా పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

## రంగురంగుల పూలతో బతుకమ్మల పేర్పు..

## సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని మన్నాన్పల్లి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను మన్నాన్పల్లిలోని సమతా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ జానపద పాటలు, బతుకమ్మ ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడుతూ పండుగ శోభను చాటిచెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, తెలంగాణ వారసత్వంపై అవగాహన, ఐక్యతా భావం పెంపొందుతాయని తెలిపారు. భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తూ వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేశారు.



# ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే..

## - ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరిచ్చారు..

## ఎన్నికల సంఘం తీరుపై - కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి ఆగ్రహం

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని కాంగ్రెస్ పార్టీ కొండాపూర్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. ఓటర్లకు తెలియకుండా వారి ఓటు హక్కును తొలగించడం, ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడటం వంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనకు మద్దతుగా సంగారెడ్డిలో కొనసాగుతున్న దీక్షకు కొండాపూర్ మండలం తరఫున సంఘీభావం ప్రకటించారు.

**ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే!**

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని మల్లారెడ్డి పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు వేసే అవకాశం కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించడం, మార్పులు చేయడం వంటి అంశాల్లో పారదర్శకత పాటించాలని, అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే ఘటనలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు వస్తే వాటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పందించాలి**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు అత్యంత ప్రాధాన్యత ఉందని మల్లారెడ్డి అన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయనే ఆరోపణలపై సమగ్రంగా పరిశీలించి, తప్పులు ఉన్నట్లు నిర్ధారణ అయితే వాటిని సరిదిద్దాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, ఓటు హక్కు కోల్పోయినట్లు భావిస్తున్నవారికి నిబంధనల ప్రకారం పరిష్కారం కల్పించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు.

**రాహుల్ గాంధీ నిరసనకు సంఘీభావం**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తోందని మల్లారెడ్డి తెలిపారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులుగా కొనసాగుతున్న దీక్షకు కొండాపూర్ మండలం తరఫున సంఘీభావం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తాయని తెలిపారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఓటు హక్కుకు సంబంధించిన ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని మల్లారెడ్డి డిమాండ్ చేశారు.



## . కల్హేర్ మార్డి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**కల్హేర్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**

కల్హేర్ మండలంలోని మార్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినులు రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి, వాటి చుట్టూ కోలాటాలు ఆడుతూ బతుకమ్మ పాటలు ఆలపించారు. 'రావమ్మ గౌరమ్మ.. మా ఇంటికి' వంటి సంప్రదాయ పాటలతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తూ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజే సంగీతంతో వేడుకలు మరింత సందడిగా సాగాయి. అలాగే కల్హేర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, శ్రీ సాయి విద్యాలయంలోనూ విద్యార్థినులు బతుకమ్మ వేడుకలను హర్షోల్లాసాల మధ్య నిర్వహించారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. మార్డి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవి సింగ్, ఉపాధ్యాయులు హనుమంతు, స్వామి తదితరులు పాల్గొన్నారు.





# ఈ నెల 11 నుంచి 20 వరకు శ్రీ ముమ్మాదేవి నవరాత్రి మహోత్సవాలు

## - అక్టోబర్ 19న మహా అన్నదాన కార్యక్రమం

## .. భక్తులకు నిర్వాహకుల ఆహ్వానం





**రాయికోడ్ అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని శ్రీ ముమ్మాదేవి దేవాలయంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు, అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11న ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమై 20వ తేదీ మంగళవారం విజయదశమి వరకు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, మహానైవేద్యం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి వేళల్లోనూ ప్రత్యేక పూజలు, తీర్థప్రసాద వితరణ జరగనున్నాయి. ఈ నెల 19వ తేదీ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి దేవాలయానికి చేర్చనున్నారు. 20వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి, అనంతరం వేద స్వస్తితో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా రోజువారీ అమ్మవారి అలంకరణలు, పూజా కార్యక్రమాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# రోడ్ల దుస్థితి నుంచి రైతుల కష్టాల వరకు.. బీఆర్ఎస్ పోరుబాట!

## - మూడు ప్రధాన డిమాండ్లతో మాసాన్‌పల్లి నుంచి కల్హేర్ వరకు పాదయాత్ర .

## - రోడ్లు వేయాలి.. గుంతలు పూడ్చాలి!

## - నల్లవాగు నీళ్లు అందించాలి..

## రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి !



**కల్హేర్. 9.అక్టోబర్. ప్రజా జ్యోతి.**

సంగారెడ్డి జిల్లా లోని మాసాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు నుంచి కల్హేర్ వరకు బీఆర్ఎస్ పాదయాత్ర కల్హేర్: మండలంలోని రహదారుల సమస్యలను పరిష్కరించాలని, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర, ధర్నా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రామ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా మాసాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు నుంచి కల్హేర్ వరకు పాదయాత్ర నిర్వహించి, అనంతరం కల్హేర్‌లో ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నల్లవాగు నీటిని రైతులకు సక్రమంగా అందించాలని, వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 10న ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామ్‌సింగ్ పిలుపునిచ్చారు.